క్లుప్తంగా

కాంగ్రెస్ విజయం తథ్యం

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌కుమార్

కుల్కచర్ల: ఎన్నిక ఏదైనా కాంగ్రెస్ విజయం తథ్యమని చౌడాపూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్పాటి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం చౌడాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో స్థానిక ఎన్నికలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొందేందుకు కార్యకర్తలు కృషిచేయాలని సూచించారు. సబ్బండ వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు నరసింహ నాయక్, ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డి, నాయకులు శశిధర్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చెన్నయ్య, మన్యం రఘు, శ్రీను, శ్రీశైలం, ఆంజనేయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సనాతన ధర్మం సర్వజన జీవన విధానం

- తెలంగాణ సాధూపరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ స్వామిజీ
- 400 మంది ముత్తయిదువులకు పాదపూజ, చీరల పంపిణీ



ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

బషీరాబాద్: సనాతన ధర్మం శాశ్వతమైనదని, సర్వజనులకు ఇది జీవన విధానం చూపిందని తెలంగాణ రాష్ట్ర సాధూపరిషత్ అధ్యక్షుడు శ్రీశంకర్ స్వామిజీ అన్నారు. మంగళవారం పౌర్ణమి సందర్భంగా దామర్‌చెడ్‌లోని అంబా భవానీ మాత దేవాలయంలో 400మంది ముత్తయిదువులకు స్వామిజీ పాదపూజ చేశారు. వారందరికీ అమ్మవారి చీరలు పంపిణీ చేశారు. అంతకుముందు భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కరుణ, వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, వివిధ గ్రామాల మహిళలు పాల్గొన్నారు.

గాజీపూర్‌లో మాణేమ్మకు నివాళి



పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న పట్నం మహేందర్‌రెడ్డి

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలం గాజీపూర్ గ్రామానికి చెందిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి సతీమణి మాణెమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి మంగళవారం గాజీపూర్ గ్రామానికి వెళ్లి మాణెమ్మ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నారాయణరెడ్డిని ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. మాణెమ్మ అంత్యక్రియాల్లో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పాల్గొని నివాళులర్పించారు. ఆయన వెంట కరణం పురుషోత్తంరావు, ధారాసింగ్, లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

మహరాజ్‌ల కుటుంబంతో ఎమ్మెల్యే భేటీ



నారాయణరావుతో చర్చిస్తున్న బీఎంఆర్

తాండూరు: తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే నారాయణరావుతో భేటీ అయ్యారు. మంగళవారం బషీరాబాద్ మండల కేంద్రంలోని మహరాజుల కుటుంబ సభ్యులను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేతో పాటు సీనియర్ నాయకులు సంపత్‌కుమార్, వెంకటేశ్ జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు అభ్యర్థుల కోసం చర్చించారు. జెడ్పీటీసీ, ఎంపీపీ సీట్లను తమ కుటుంబానికే ఇస్తే గెలిచి వస్తామని మాజీ ఎమ్మెల్యే బీఎంఆర్‌కు ప్రతిపాదించారు. ప్రతి మండలం నుంచి నలుగురి పేర్లతో కూడిన జాబితాను మంత్రి శ్రీధర్‌బాబుకు పంపించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. పార్టీ నేతల సర్వేలో ఎవరి పేర్లు వస్తే వారికే టికెట్ కేటాయిస్తామన్నారు. మరోవైపు బషీరాబాద్‌కు చెందిన మాజీ ఎంపీపీ అరుణ అజయ్ ప్రసాద్ నివాసానికి వెళ్లి చర్చించారు. ఎన్నికలలో టికెట్ ఎవరికి వచ్చినా గెలుపునకు పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యం

- మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి
- కాంగ్రెస్ మోసపూరిత హామీలను ఎండగట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్‌రెడ్డి

పూడూరు: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం పూడూరు మండల బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం రాకంచర్లలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మోసపూరిత హామీలను గ్రామాల్లో ప్రజలకు వివరించి ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని సూచించారు. అనంతరం కాంగ్రెస్ బాకీ పత్రికను విడుదల చేశారు. మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సమక్షంలో పెద్ద ఉమ్మెంతాల్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కొప్పుల అనీల్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు అజీం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అజారుద్దీన్, మాజీ సొసైటీ చైర్మన్ నర్సింహారెడ్డి, మాజీ ఎంపీపీ మల్లేశం, నాయకులు రాంరెడ్డి, వెంకటయ్య, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

పరిగి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా ఎంటో చూపించాలని, ప్రజలు బీఆర్‌ఎస్ వైపే ఉన్నారని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలో మండల బీఆర్‌ఎస్ నాయకుల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన బూటకపు హామీలను ప్రజలకు వివరించాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలు బీఆర్‌ఎస్ పాలనను కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కొప్పుల అనిల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంజనేయులు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, పార్టీ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ మాజీ సభ్యులు హరిప్రియ, మాజీ మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్ కుమార్, రాజేందర్, వెంకట్‌రాంరెడ్డి, హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రమేశ్‌నాయక్ ఆచూకీ తెలపాలి

బీజేపీ ఎస్టీసెల్ శాఖ అధ్యక్షుడు రవినాయక్



రమేష్‌నాయక్ తల్లిదండ్రులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

దౌల్తాబాద్: మండలంలోని బోడమర్రి తండాకు చెందిన రమేశ్‌నాయక్ ఆచూకీ కనిపెట్టాలని బీజేపీ రాష్ట్ర ఎస్టీసెల్ అధ్యక్షుడు రవినాయక్ పోలీసులను డిమాండ్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పాత్లవత్ రమేశ్‌నాయక్‌ను మద్దూరు మండలానికి చెందిన ఇద్దరు మైనార్టీ నాయకులు మతమార్పిడి పేరుతో, డబ్బులు ఇవ్వకుండా ఇచ్చినట్లు ప్రామిసరీ నోట్ రాయించుకుని వేధింపులకు పాల్పడ్డారన్నారు. ఈ విషయంలో భయాందోళనకు గురైన రమేశ్‌నాయక్ గత నెల 23వ తేదీన 17 పేజీల సుసైడ్‌నోట్ రాసి కనిపించకుండా పోయాడన్నారు. మంగళవారం తండాలోని రమేశ్‌నాయక్ కుటుంబాన్ని బీజేపీ నాయకులతో కలిసి రవినాయక్ పరామర్శించారు. తల్లిదండ్రులతో దీని గురించి కొంత సేపు మాట్లాడారు. ముఖ్యమంత్రి ఇలాఖలో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఈ విషయం గురించి పోలీసులకు ఫిర్యాదు చేసి 14 రోజులవుతున్నా బాధ్యులను అరెస్టు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. 48 గంటల్లో ఆచూకీ కనిపెట్టకపోతే బీజేపీ ఆధ్వర్యంలో డీజీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అవసరమైతే జాతీయ ఎస్టీ కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేయనున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కల్యాణ్‌నాయక్, నాగురావునామాజీ, పున్నంచంద్‌లాహోటీ, పగడాకుల శ్రీనివాస్, సత్యయాదవ్, మదన్, ప్రతాప్‌రెడ్డి, వెంకటయ్య, కూంద్రున ర్సిములు, రవినాయక్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణకు ఐదు కౌంటర్లు

దౌల్తాబాద్: మండలంలో 14 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనుండగా నామినేషన్లు దాఖలు చేసేందుకు ఐదు కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మాటూరు, బిచ్చాల, చంద్రకల్ ఎంపీటీసీ స్థానానికి ఒకటో కౌంటరు, బాలంపేట, సుల్తాన్‌పూర్, దేవర్‌ఫసల్‌వద్ రెండో కౌంటర్, గోకఫసల్‌వాద్, తిమ్మారెడ్డిపల్లి, అల్లాపూర్‌లకు మూడో కౌంటర్, దౌల్తాబాద్-1, దౌల్తాబాద్-2 నాలుగో కౌంటర్, చల్లాపూర్, నందారం, నీటూరు స్థానాలకు ఐదో నంబర్ కౌంటర్ కేటాయించినట్లు, నామినేషన్లు సంబంధిత కౌంటర్లలో దాఖలు చేయాలని తెలిపారు.

గ్రామపాలన అధికారుల నియామకం

కుల్కచర్ల: గ్రామపాలన అధికారుల నియామకప్రక్రియలో భాగంగా మంగళవారం కుల్కచర్ల తహసీల్దార్ కార్యాలయంలో ఐదుగురు భానుచందర్, ప్రవీణ్‌కుమార్, నర్సింలు, రాములు, సత్యమ్మ, చౌడాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో మరో ముగ్గురు లాలప్ప, వెంకటయ్య, హన్మంతులు నూతనంగా బాధ్యతలను స్వీకరించారు. ఒక్కో గ్రామానికి ఒక అధికారికి బాధ్యతలు అప్పగించేవిధంగా నియామకం కొనసాగింది. గతంలో జూనియర్ అసిస్టెంట్‌లుగా కొనసాగుతున్న వారిని సైతం ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో గ్రామపాలన అధికారులుగా ఆయా గ్రామాలకు ఇన్‌చార్జి బాధ్యతలు కేటాయించారు.

నేడు బీఆర్‌ఎస్ సమావేశం

దోమ: బీఆర్‌ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం బుధవారం ఉంటుందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దోమ మండల కేంద్రంలోని ఎస్‌జీ గార్డెన్‌లో ఉదయం 11 గంటలకు ఈ సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నాగిరెడ్డి హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాల కార్యకర్తలు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్‌రూరల్: ఉద్యోగ రీత్యా పదవీ విరమణ సహజమేనని, ఉపాధ్యాయ వృత్తి సమాజంలో ఎంతో గొప్పదని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని చిన్నమంగళారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేసిన ఎస్.వెంకటయ్య పదవీ విరమణ అభినందన సభను పీజీఆర్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని వెంకటయ్యను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే, పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పుల్గం దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. 40 సంవత్సరాల పాటు ఉపాధ్యాయ వృత్తిలో వెంకటయ్య చేసిన సేవలు మరచిపోలేనివన్నారు. రాష్ట్రంలో పదోన్నతులు త్వరలో జరగబోతున్నాయన్నారు. ఈహెచ్‌ఎస్ ద్వారా ఉపాధ్యాయులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 1వ తేదీన ఇందిరాపార్కు వద్ద ఓపీఎస్ సాధనకు తలపెట్టనున్న పీఆర్టీయూ ధర్నా కార్యక్రమానికి ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో చిన్నమంగళారం మాజీ సర్పంచ్ బాలమణిరాములు, నాయకులు పూలగుళ్ల గోపాల్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, మల్లేశ్, ఎం.ప్రభాకర్, ఉపాధ్యాయ సంఘం నాయకులు గిరిధర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానంద్‌గౌడ్, మండల విద్యాధికారి మల్లయ్య, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు జక్కని బందయ్య పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులను కలగలిపి రాసినవే కీర్తనలు



లొంకక్షేత్రం కీర్తనల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న భాస్కరయోగి తదితరులు

ఆధ్యాత్మికవేత్త భాస్కరయోగి

పరిగి: భక్తిప్రపత్తులను కలగలిపి రాసినవే కీర్తనలని ఆధ్యాత్మిక వేత్త భాస్కరయోగి అన్నారు. సంకీర్తనకారులు అంజలరెడ్డి, రాములు సంయుక్తంగా రచించిన లొంకఆంజనేయస్వామి భజన కీర్తనలను మంగళవారం లొంకక్షేత్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ఆధ్యాత్మికతను రక్షిస్తున్న వాళ్లే సంకీర్తన కారులన్నారు. తెలంగాణలో సుమారు 350 మంది ఉన్నారని, వారిలో వీరు కూడా అని సూచించారు. సంకీర్తనకారులు రచించిన లొంక ఆంజనేయస్వామి కీర్తనలు అద్భుతంగా ఉన్నాయని పేర్కొన్నారు. తాళం, రాగం, భావం మూడింటి మేలవింపే ఆంజనేయస్వామి భక్తిప్రపత్తులను కలగలిపి రాసినవని కొనియాడారు. ఈ కీర్తనలు పాడుకోవడానికి సులభంగా గొప్పాగా ఉన్నాయని పేర్కొన్నారు. హిందువులు, భజనలు, కీర్తనలు పాడి గ్రామాల్లో వినిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సిరెడ్డి, రమేష్, గోపాల్, చుక్కయ్య, జంగయ్య, లాలయ్య భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ ఆదర్శం

ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి



వాల్మీకి దేవాలయం వద్ద బోయ వాల్మీకి సంఘ సభ్యులు

తాండూరు టౌన్: యుగయుగాలకు ఆదర్శనీయుడని పలువురు కొనియాడారు. వాల్మీకి జయంతి వేడుకలు మంగళవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. బోయ వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో వాల్మీకినగర్‌లోని దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు నాయకులు, పట్టణ ప్రముఖులు ఆయన విగ్రహాన్ని దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. పట్టణ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, మాజీ కౌన్సిలర్లు పరిమళ, రవిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో...

పట్టణ మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ యాదగిరి, సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ నరేందర్‌రెడ్డి, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ఆర్‌ఐ రాములు సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో పలువురు తాండూరు నాయకులు పాల్గొన్నారు. జిల్లా కార్యదర్శి జుంటుపల్లి వెంకటేశ్, సుదర్శన్ గౌడ్, వడ్ల విజయ్, గోపాల్, లాలయ్య, జగదీశ్ తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

'స్థానిక' పోరులో బీజేపీ సత్తాచాటాలి



బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రత్నం

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

నవాబుపేట: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటాలని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకపోవాలన్నారు. మండలంలోని 12 ఎంపీటీసీ స్థానాలకు అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకుందామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన అమలు కానీ హామీలను ప్రజలకు అర్థమయ్యేవిధంగా వివరించాలన్నారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలను పార్టీలోకి చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చంద్రకాంత్, బీజేపీ నాయకులు ప్రతాప్ రెడ్డి, గాలయ్య, జగన్, శ్రీధర్, రాజశేఖర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, రత్నం, రవి, జైపాల్ రెడ్డి, గోపాల్ గౌడ్, గోపాల్ రెడ్డి, రవి, లక్ష్మణ్, శివప్రభూ, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసులు కొనసాగించాలి

బీజేపీ మండల అధ్యక్షుడు మహేశ్‌యాదవ్



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహేశ్‌యాదవ్ తదితరులు

బంట్వారం: బస్సు సర్వీసులు కొనసాగించాలని బీజేపీ మండల అధ్యక్షుడు మహేశ్‌యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి తహసీల్దార్ విజయ్‌కమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయని, వెంటనే మరమ్మతులు చేయించి రద్దైన ఆర్టీసీ బస్సు సేవలను యథావిధిగా నడిపించాలని ఆయన డిమాండ్ చేశారు. బస్సు సర్వీసులు రద్దై 10 రోజులు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. బస్సు సర్వీసు నిలిపేయడంతో ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు ఆర్అండ్‌బీ అధికారులు ఉన్నట్లా లేనట్లా? అంటూ ఆయన ప్రశ్నించారు. నూరుల్లాపూర్ వాగు సమీపంలో ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సత్వరమే స్పందించి తగు చర్యలు తీసుకోవాని కోరారు. లేనిచో పెద్ద ఎత్తున్న ధర్నా చేస్తామంటూ ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో చనిపోయిన వారి పేర్లు !

- తొలగించాలంటూ ఫిర్యాదు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కిందిస్థాయి సిబ్బంది



జాబితాలో తొలగించని పేరు సర్కిల్‌లో

దౌల్తాబాద్: ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించాలని పొరపాట్లకు తావివ్వొద్దని ఎన్నికల అధికారులు పదేపదే వివరించినప్పటికీ తప్పులు దొర్లుతూనే ఉన్నాయి. ఈ విషయంలో కిందిస్థాయి అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వీడడం లేదు. ఏళ్ల క్రితం మరణించిన వారి పేర్లు కూడా జాబితాలో కనిపించడం, పలువురి పేర్లను తప్పుగా నమోదు చేయడంతో ఆశ్చర్యానికి గురవుతున్నారు. కొందరికి రెండు చోట్ల ఓటు కల్పించారు. చనిపోయినా వారి పేర్లు జాబితాలో ఎలా ఉంచుతారని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో...

దౌల్తాబాద్ మండలంలో 33 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల కోసం అధికారులు తుది ఓటరు జాబితా విడుదల చేశారు. ఒక జెడ్పీటీసీ, 14 ఎంపీటీసీ స్థానాలకు గాను మొత్తం 40,977 ఓటర్లు ఉన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా తయారు చేసిన ఓటరు జాబితాను రెవెన్యూ అధికారులు పంచాయతీరాజ్ శాఖకు అప్పగించారు. వాటిని సదరు శాఖ అధికారులు ఎంపీటీసీ స్థానాల వారీగా, వార్డుల వారీగా మరో జాబితా రూపొందించారు. వాటిని బీఎల్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు పరిశీలించాక తుది జాబితాను ప్రదర్శించారు. ఇంత వడబోసినా పలు గ్రామాల్లో మరణించిన వారి పేర్లు ఉండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి గ్రామంలో 5నుంచి 10 మంది వరకు మరణించిన పేర్లు ఉంటాయని తెలుస్తుంది. ఈ విషయంలో అధికారులు దృష్టి సారించి మరణించిన వారి పేర్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

జీతాలు చెల్లించే వరకు పాఠాలు చెప్పం

డీఐఈఓకు వినతి పత్రం అందజేత



డీఐఈఓకు వినతి పత్రం అందజేస్తున్న అతిథి అధ్యాపకులు

తాండూరు టౌన్: జీతాలు చెల్లించే వరకు పాఠాలు చెప్పమంటూ జిల్లాలోని పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న అతిథి అధ్యాపకులు డీఐఈఓ శంకర్‌నాయక్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ, ప్రతీనెల విడుదల కావాల్సిన జీతాలు 9 నెలలు గడుస్తున్నా నేటికి ఇవ్వలేదన్నారు. దీంతో తాము అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. కుటుంబ పోషణ భారమై, అప్పులు చేసి అవమానాలపాలవుతున్నామని వివరించారు. వెంటనే తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించాలని కోరారు.

గ్రూప్1 సాధించడం యువతకు ఆదర్శం



మారుతిని సన్మానిస్తున్న పీఎస్‌పీఎస్ సంఘం నాయకులు

పరిగి పరిరక్షణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘువేందర్ గౌడ్

కుల్కచర్ల: గ్రూప్1 సాధించడం భవిష్యత్ యువతకు ఆదర్శమని పరిగి పరిరక్షణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘువేందర్ గౌడ్ పేర్కొన్నారు. కుల్కచర్ల మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన మారుతి ఇటీవల ప్రకటించిన గ్రూప్1 ఫలితాల్లో మెరుగైన ప్రతిభను చాటి మున్సిపల్ కమిషనర్‌గా ఎంపికవ్వడం అభినందనీయమన్నారు. మంగళవారం కుల్కచర్లలోని ఆయన నివాసంలో పరిగి పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో గ్రూప్ 1 విజేతను, వారి కుటుంబీకులను ఘనంగా సన్మానించారు. అనంతరం రాఘువేందర్ గౌడ్ మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంత యువకులు గ్రూప్1 ఉద్యోగాలు సాధించడంతో ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రాంచంద్రయ్య, రాములు, శశిధర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మోహన్ నాయక్, అబ్దుల్, రాజేందర్ రెడ్డి, బాలకృష్ణ, సత్యయ్య తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

సీడీపీఓ మెహరున్నీసా బేగం



పోషణ మాసోత్సవంలో మెహరున్నీసా బేగం

దోమ: ప్రతిఒక్కరూ పోషకాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని సీడీపీఓ మెహరున్నీసా బేగం అన్నారు. మంగళవారం దోమ మండల పరిధిలోని గొడుగోనిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ అంజమ్మ, టీచర్ మల్లేశ్వరితో కలిసి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పాలు, గుడ్లు, బాలమృతం ప్యాకెట్లను అందజేశారు. అనంతరం పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల ఎత్తు, బరువు తీసుకొని వారికి అవసరమైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

మహిళలే అధికం

- రిజర్వేషన్ 50శాతం
- మండలంలో సగం కంటే ఎక్కువ వారికే
- జనరల్ స్థానానికి పోటీకి సై
- స్థానిక సంస్థల్లో పెరగనున్న సంఖ్య

దౌల్తాబాద్: జనాభాలో దాదాపు సగం ఓటర్లలో పురుషుల కంటే మహిళలు ఎక్కువగా ఉన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచి వార్డు స్థానాల్లో పోటీకి సై అంటున్నారు. స్థానిక ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ 50శాతం అమలు చేస్తున్నందునా మండలంలోని అన్ని స్థానాల్లో సగం కంటే ఎక్కువ సీట్లు దక్కనున్నాయి. స్థానిక సంస్థల్లోని అన్ని పదవులకు కలిపి మహిళలకే అధిక సీట్లు రిజర్వు చేశారు. పలు జనరల్ స్థానాల్లో కూడా పోటీ చేసేందుకు సన్నద్ధమవుతుండడంతో స్థానిక సంస్థలో వారి సంఖ్య మరింతగా పెరగనుంది. ఇంతకాలం నాయకులు ఆశించిన పలు స్థానాలు మహిళలకు రిజర్వు కావడంతో వాటిల్లో వారి కుటుంబీకులను రంగంలోకి దింపేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

ఓటర్లు ఇలా...

మండలంలో 33 గ్రామ పంచాయతీలు ఉండగా అన్ని గ్రామాల్లో కలిపి 40,977 ఓట్లు ఉన్నాయి. దీంట్లో 20,953 మహిళా ఓటర్లు ఉన్నారు. పురుషుల కంటే 934 మంది అధికంగా ఉన్నారు. స్థానిక సంస్థలకు సంబంధించిన మండలంలో వార్డు సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీ, జెడ్పీటీసీ పదవులు కలిపి మొత్తం 339 ఉన్నాయి. వీటిల్లో 162 స్థానాలు రిజర్వు చేశారు.